# తూర్పు గోదావరి

# వార్త



మంగళవారం 10, ఏప్రిల్ 2018 | 8 పేజీలు




వీసీ దంపతులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

# వీసీ పాలన ప్రగతిపథం

## జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

జేఎన్‌టీయూకే ఉపకులపతి వీఎస్ఎస్ కుమార్ పదవీకాలం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలుసభకు రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు అధ్యక్షత వహించగా, ఓఎస్‌డీ కేవీ రమణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వీసీ కృషితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, నర్సారావుపేటలో యూసీఈకే భవన నిర్మాణంతోపాటు ఒకమార్కులో ఫెయిలైన విద్యార్థులకు లబ్ధి కలిగిలా 0.15శాతం గ్రేస్‌మార్కులను కేటాయించి పర్సంటేజీ పెరిగేలా చర్యలు చేపట్టారన్నారు. గ్రంథాలయాల అనుసంధానం చేసి విద్యార్థులకు ఆన్‌లైన్ జర్నల్స్ అందుబాటులో తేవడంతోపాటు జంబ్లింగ్ విధానం, ఆధునాతన ప్రింటింగ్ మిషన్లు ఏర్పాటు చేశారన్నారు. రెక్టార్ కె.పూర్ణానందం మాట్లాడుతూ వీసీ పాలన పారదర్శకతతో కూడినదని, ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా ఎవరినీ నొప్పించక అందరిహృదయాల్లో స్థానం సంపాదించారని కొనియాడారు. ఆర్.డి.డైరెక్టర్ సాయిబాబు మాట్లాడుతూ ఎంసెట్ చైర్మన్‌గా నాలుగుసార్లు సారథ్యం వహించి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత వీసీ మాట్లాడుతూ వర్సిటీని అభివృద్ధిపథంలో నడిపించడంలో వర్సిటీ అధికారులు, సిబ్బంది సహకరించారన్నారు. జన్మనిచ్చిన తల్లిని, చదువు నేర్పిన విద్యాలయాన్ని ఎప్పటికి మరువరాదని, తనకు వీసీగా సేవచేసే అవకాశం కల్పించిన సీఎంకు, గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వీసీ దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, యూసీఈకే, యూసీఇఎస్ ప్రిన్సిపాల్స్, పలు విభాగాధిపతులు, అనుబంధ కళాశాలల చైర్మన్లు, ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జ్‌వీసీగా రామకృష్ణ



జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జ్ వీసీగా మచిలీపట్నం కృష్ణాయూనివర్సిటీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు నియమితులయ్యారు. ప్రస్తుత వీసీ వీఎస్ఎస్ కుమార్ పదవీకాలం సోమవారం ముగియడంతో ఇన్‌ఛార్జ్‌గా రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం రాత్రి ఆయనను ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను వర్సిటీ అధికారులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.